



EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
మంగళవారం
25-11-2025
పేజీలు: 02




## నవంబర్ 28న ఓటీటీలో మాస్ జాతర

మాస్ మహారాజా రవితేజ కెరీర్‌లో 75వ చిత్రంగా రూపొందిన 'మాస్ జాతర' అక్టోబర్ 31న థియేటర్లలో విడుదలై మిక్స్‌డ్ టాక్ దక్కించుకుంది. ఈ యాక్షన్ ఎంటర్టైనర్‌లో రవితేజ సరసన యువ సంచలన హీరోయిన్, తెలుగమ్మాయి శ్రీ లీల నటించింది. తాజాగా ఈ సినిమా ఓటీటీ రిలీజ్ డేట్‌ను నెట్‌ఫ్లిక్స్ ప్రకటించింది. థియేటర్లలో విడుదలైన నాలుగు వారాల వ్యవధిలోనే 'మాస్ జాతర' ఓటీటీకి వస్తోంది. గ్లోబల్ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమాకు డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకుంది. నవంబర్ 28వ తేదీ నుంచి 'మాస్ జాతర'ను తమ ప్లాట్‌ఫారమ్‌లో స్ట్రీమ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఓ దశలో సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితం రాబట్టకపోవడంతో, నెట్‌ఫ్లిక్స్ స్ట్రీమింగ్‌ను వాయిదా వేసిందని ప్రచారం జరిగింది. అయితే తాజా అప్‌కమింగ్ మూవీస్ లిస్టులో 'మాస్ జాతర'ను చేర్చడంతో ఆ రూమర్లకు ఫుల్ స్టాప్ పడింది. మాస్ జాతర కథ విషయానికి వస్తే.. సినిమాలో రవితేజ రైల్వే పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తారు. నిజాయితీ, కఠినత్వానికి మారుపేరైన ఆయన వరుసగా ట్రాన్స్‌ఫర్‌లు ఎదుర్కొంటూ ఉంటారు. ఓ మంత్రిని ఎదిరించడంతో వరంగల్ నుంచి శ్రీకాకుళంకు బదిలీ అవుతాడు.అక్కడ ఓ అమ్మాయి (శ్రీ లీల)ను ప్రేమించటం మొదలవుతుంది. ఆమె టీచర్ అని భావించిన హీరో, తర్వాత ఆమె గంజాయి స్మగ్లింగ్‌లో భాగమని తెలుసుకుని షాక్ అవుతాడు.



## నటుడు విశాల్‌కు భారీ షాక్

తమిళ సినీ ఇండస్ట్రీలో యాక్షన్ హీరోగానే కాకుండా నిర్మాతగా కూడా ప్రత్యేక గుర్తింపు పొందిన విశాల్, ప్రస్తుతం తీవ్ర ఆర్థిక లీగల్ సంక్షోభంలో చిక్కుకున్నాడు. విశాల్ ఫిలిం ఫ్యాక్టరీ తరఫున గతంలో తీసుకున్న రుణం, ఆపై లైకా ప్రొడక్షన్స్‌తో జరిగిన ఒప్పందం ఉల్లంఘన కేసు కోర్టులో ఊహించని మలుపు తీసుకుంది. విశాల్ గతంలో ప్రముఖ ఫైనాన్షియర్ అన్బు చెలియన్ వద్ద నుండి సుమారు ₹21 కోట్లు రుణం తీసుకున్నారు.సమయానికి చెల్లించలేకపోవడంతో ఆ మొత్తాన్ని లైకా ప్రొడక్షన్స్ క్లియర్ చేసింది. దీనికి ప్రతిగా విశాల్ భవిష్యత్తులో నిర్మించే సినిమాల డిస్ట్రిబ్యూషన్ హక్కులు పూర్తిగా లైకాకే ఇవ్వాలని ఒప్పందం కుదిరింది. అయితే, 'వాగై సూడుం' సినిమాను విశాల్ స్వయంగా విడుదల చేయడంతో లైకా కోర్టును ఆశ్రయించింది. విశాల్ ఒప్పందాన్ని ఉల్లంఘించాడని,తీసుకున్న మొత్తం 30% వడ్డీతో తిరిగి చెల్లించాలని కోరింది. కొన్ని నెలలుగా సాగుతున్న విచారణకు తాజాగా కీలక తీర్పు వెలువడింది. విశాల్ వెంటనే ₹21.30 కోట్లు 30% వడ్డీతో చెల్లించాలని సింగిల్ బెంచ్ ఆదేశించింది. ఈ తీర్పుతో విశాల్‌కు భారీ షాక్ తగిలింది. విశాల్ టీం ఈ తీర్పుపై అపీల్ దాఖలు చేసుకుంది. అదే సమయంలో విశాల్ తరఫున న్యాయవాదులు .."విశాల్ ధనవంతుడు కాదు.. ఒకేసారి ఇంత పెద్ద మొత్తం చెల్లించడం సాధ్యం కాదు" అని కోర్టులో వాదించారు. దీనిపై ద్విసభ్య బెంచ్ "అలా అయితే విశాల్ దివాళా ప్రకటించేందుకు సిద్ధమా ?" అని ప్రశ్నించడం కోర్టులో ఆసక్తికర చర్చకు దారితీసింది.

## ఈ ఒక్క మెసేజ్
# ఐబొమ్మ రవిని పట్టించింది







తెలుగు సినీ పరిశ్రమలో కొన్నేళ్లుగా తీవ్ర చర్చకు దారితీసిన అంశం పైరసీ. ముఖ్యంగా కొత్త సినిమాలు విడుదలైన గంటల్లోనే ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమయ్యే పరిస్థితి నిర్మాతలకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. ఈ పైరసీ సామ్రాజ్యానికి రాజుగా.. ట్రెండ్ సెట్టర్‌గా వెలుగొందిన వ్యక్తే ఐబొమ్మ ఇమంది రవి. తెలుగు రాష్ట్రాల్లో సోషల్ మీడియాల ద్వారా.. అనధికార వెబ్‌సైట్ల ద్వారా ఈయన సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. కేవలం ఆరేళ్ల స్వల్ప వ్యవధిలో పైరసీ ద్వారా కోట్ల రూపాయల అక్రమ సంపదను కూడబెట్టాడు. సాంకేతిక పరిజ్ఞానంపై రవికి ఉన్న అపారమైన పట్టు.. అతన్ని సైబర్ నేరాల ప్రపంచంలో కింగ్‌మేకర్‌గా మార్చింది. తన పైరసీ కార్యకలాపాలను కేవలం దేశీయంగా కాకుండా.. అంతర్జాతీయ స్థాయిలో విస్తరించాడు. దేశ, విదేశాల్లో వందలాది మంది ఏజెంట్లను నియమించుకుని, ఒక పటిష్టమైన నెట్‌వర్క్‌ను రూపొందించాడు. అతడి పైరసీ వ్యాపారం గుట్టు విదేశాల్లోని సర్వర్లలో నిక్షిప్తమై ఉండేది. యునైటెడ్ కింగ్‌డమ్, కరేబియన్ దీవుల వంటి ప్రాంతాల నుంచి కూడా ఈ కార్యకలాపాలను నిర్వహించడానికి సిబ్బందిని ఏర్పాటు చేసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. డేటా అంతా విదేశాల్లో ఉండటం వలన, తనను పట్టుకోవడం పోలీసులకు అంత సులభం కాదనే ధీమాతో రవి ఉండేవాడు. ఐబొమ్మ వెబ్‌సైట్ పై నిఘా పెట్టిన సైబర్ క్రైమ్ పోలీసులకు.. ఆ వెబ్‌సైట్ నిర్వాహకుడు సవాల్ విసిరి మరింత ఆగ్రహాన్ని తెప్పించాడు. తమపై దృష్టి పెట్టడం ఆపాలని నేరుగా పోలీసులకే సవాల్ విసిరాడు. ఈ సవాల్‌ను స్వీకరించిన నగర సైబర్ క్రైమ్ పోలీసులు, రవి కదలికలపై సుమారు మూడు నెలల పాటు అత్యంత గోప్యంగా నిఘా పెట్టారు. రవి ఎంతటి సాంకేతిక నిపుణుడైనా.. ఏదో ఒక ఆధారం వదిలేస్తాడనే సూత్రాన్ని పోలీసులు నమ్మారు. చివరకు.. ఒక కీలకమైన ఈ-మెయిల్ లింక్ ఆధారంగా నిందితుడి ఆచూకీని పసిగట్టారు. రవి.. ఈఆర్ ఇన్ఫోటెక్ అనే కంపెనీ పేరుతో డొమైన్‌లను కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ఈ డొమైన్ రిజిస్ట్రేషన్ల ద్వారా లభించిన ఫోన్ నంబరు ఆధారంగా.. రవి ఎవరెవరితో సంభాషిస్తున్నాడో, ఎలాంటి లావాదేవీలు చేస్తున్నాడో పోలీసులు విశ్లేషించడం మొదలుపెట్టారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. రవి ఎక్కువ సమయం విదేశాల్లోనే గడిపేవాడు. అరుదుగా హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఉన్న తన నివాసానికి వచ్చేవాడు. ఈ-మెయిల్ లింకుల ద్వారా పోలీసులు, రవికి నగరంలో ఉన్న అత్యంత సన్నిహితుడైన మిత్రుడిని గుర్తించారు. ఆ మిత్రుడి ఫోన్ నంబర్‌ను సేకరించి.. రవి హైదరాబాద్‌కు వచ్చినప్పుడల్లా తమకు సమాచారం అందేలా రహస్యంగా ఏర్పాటు చేసుకున్నారు. పోలీసుల వేట ఫలించింది. ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న రవి.. తన మిత్రుడికి ఒక మెసేజ్ పంపాడు. 'మామా హైదరాబాద్ వచ్చా.. అంటూ కూకట్‌పల్లిలోని తన ఇంటికి రావాలని స్నేహితుడిని ఆహ్వానించాడు. ఈ ఒక్క మెసేజ్ ద్వారా రవి నగరంలో ఉన్నట్లు కచ్చితంగా నిర్ధారించుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు, క్షణం ఆలస్యం చేయకుండా కూకట్‌పల్లిలోని నివాసానికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో రవి పొంతన లేని సమాధానాలు ఇస్తూ.. తన విదేశీ సర్వర్ల వివరాలు, సిబ్బంది గురించి అడిగిన ప్రతిసారీ సమాధానం దాటవేస్తున్నట్లు సమాచారం. అయితే.. తన పైరసీ వ్యాపారం ఏదో ఒక రోజు బయటపడుతుందని తనకు తెలుసని, కానీ ఇంత త్వరగా పట్టుబడతానని ఊహించలేదని మాత్రం పోలీసు అధికారులతో చెప్పినట్లు తెలిసింది. రవిని నాంపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా.. న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## భారతీయ నాగరికతకు ఈ జెండా పునర్జీవం: ప్రధాని మోదీ




అయోధ్య రామాలయ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ ఇవాళ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ధర్మ ధ్వజం కేవలం జెండా మాత్రమే కాదు అని, భారతీయ నాగరికతకు పునర్జీవంగా ఈ పతాకం నిలుస్తుందని అన్నారు. కాషాయ జెండా సూర్యవంశానికి చిహ్నమని, ఓం అక్షరం.. కోవింద వృక్షం .. రామరాజ్యానికి సంకేతంగా నిలుస్తుందన్నారు. సంకల్పానికి, సక్సెస్‌కు ఈ జెండా చిహ్నమన్నారు. వందేళ్ల పోరాటానికి.. రాబోయే వేల శతాబ్ధాలకు ఈ జెండా రాముడి విలువలను చాటుతుందన్నారు. సత్యమే ధర్మం అని ప్రధాని మోదీ అన్నారు. వివక్ష, బాధ ఉండకూడదని, శాంతి.. సంతోషం ఉండాలన్నారు. పేదరికం ఉండకూడదని, ఎవరూ నిస్సహాయంగా ఉండరాదన్నారు. గుడికి రాలేని వారు, గుడిపై ఎగురుతున్న జెండాను చూసినా.. వారికి అంతే పుణ్యం దక్కుతుందని మన గ్రంధాలు చెబుతాయని, చాలా దూరం నుంచి కూడా జెండాను చూసి రామ్‌లల్లా పుట్టిన ప్రదేశం ఇదే అన్న ప్రేరణ పొందవచ్చు అన్నారు. ఈ అద్భుతమైన సందర్భంలో కోట్లాది మంది రామ భక్తులకు హృదయ పూర్వక గ్రీటింగ్స్ చెబుతున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. రామాలయ నిర్మాణం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రామాలయ నిర్మాణంలో పాల్గొన్న ప్రతి ఒక్క కార్మికుడు, కళాకారుడు, ప్లానర్, ఆర్కిటెక్ట్, వర్కర్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు.

## శాలిబండ అగ్నిప్రమాద ఘటన.. సంచలన విషయాలు బయటపెట్టిన డ్రైవర్



శాలిబండ గోమతి ఎలక్ట్రానిక్స్‌లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంపై మొగల్‌పురా పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మణికంఠను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో కారు డ్రైవర్ సంచలన విషయాలు బయటపెట్టారు. రాత్రి 10:30 గంటలకు ఏదో పెద్ద బ్లాస్ట్ అయినట్టుగా ఒక్కసారిగా శబ్దం వినిపించిందని.. శబ్దం రావడంతో తన కారు పల్టీ కొట్టిందని తెలిపారు. కారుకు సంబంధించిన గ్లాస్ మొత్తం కూడా ధ్వంసం అయిపోయిందన్నారు. కార్‌లో తాను ఒక్కడినే ఉన్నానని.. కార్ ముందు అద్దాలను పగలగొట్టి బయటపడినట్లు తెలిపారు. కారు నుంచి బయటకు వచ్చిన వెంటనే పూర్తిగా కాలిపోయిందని చెప్పారు. కారులో సీఎన్జీ సిలిండర్ ఏమి పేలలేదని స్పష్టం చేశారు. ఎవరెస్ట్ ఫ్లీట్ కంపెనీ ప్రైవేటు లిమిటెడ్ అనే కంపెనీ పేరుతో ఉబర్ డ్రైవర్‌గా ఉబర్ నడుపుతున్నట్లు వెల్లడించారు. చార్మినార్ దగ్గర ప్యాసింజర్స్‌ను డ్రాప్ చేశానని... మరో పికప్ శాలిబండ సైడ్ పడిందని అందుకే అక్కడికి బయలుదేరినట్లు తెలిపారు. ఈ క్రమంలో గోమతి ఎలక్ట్రానిక్ షాప్ దగ్గర భారీ శబ్దం వచ్చిందని.. ఎలా వచ్చిందో తెలియదని.. వెంటనే తన కారు కూడా బోల్తా పడిందని డ్రైవర్ మణికంఠ పేర్కొన్నారు.


### ఆ కోణంలో దర్యాప్తు...

అయితే.. ప్రమాదంపై డ్రైవర్ కొత్త అంశం చెప్పడంతో షాప్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగి ప్రమాదం చోటు చేసుకుందా అనే కోణంలో ప్రస్తుతం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అసలు ప్రమాదంపై ఎలాంటి క్లారిటీ లేని పరిస్థితి. దీంతో అన్ని కోణాల్లోనూ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు.



## మళ్లీ ఆసుపత్రిలో చేరిన స్మృతి మంధానకు కాబోయే భర్త

భారత మహిళా క్రికెటర్ స్మృతి మంధానకు కాబోయే భర్త పలాశ్ ముచ్చల్ మళ్లీ ఆసుపత్రిలో చేరారు. రెండు రోజుల క్రితం పలాశ్ వైరల్ ఇన్ఫెక్షన్‌తో సాంగ్లీలోని ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. ఇప్పుడు మరోసారి అనారోగ్యానికి గురి కావడంతో ఆసుపత్రిలో చేరారు. మంగళవారం ఉదయం ముంబైలోని ఎస్‌వీఆర్ ఆసుపత్రిలో చేరినట్లు ఆయన టీమ్ తెలిపింది. కాగా, ఆదివారం స్మృతి-పలాశ్ వివాహం జరగనుండగా.. క్రికెటర్ తండ్రి హఠాత్తుగా అనారోగ్యానికి గురైన విషయం తెలిసిందే. దీంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. దీంతో పెళ్లిని వాయిదా వేశారు. ఆ కాసేపటికే పలాశ్ కూడా అస్వస్థతకు గురికావడంతో ఆయన్ని కూడా ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. ఇప్పుడు మళ్లీ ఆసుపత్రిలో చేరడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, స్మృతి తండ్రికి, పలాశ్‌కు మంచి అనుబంధం ఉందని.. ఆదివారం అనారోగ్యానికి గురవడాన్ని తట్టుకోలేకపోయిన పలాశ్ దాదాపు నాలుగు గంటల పాటు ఏడుస్తూనే ఉన్నారని అతడి తల్లి పేర్కొంది. దాంతోనే పలాశ్ ఆరోగ్యం క్షీణించినట్లు తెలిపింది. దానికి తోడు వరుస ప్రయాణాలు, సంగీత్, వివిధ కార్యక్రమాల్లో బిజీగా ఉండటంతో సరైన నిద్ర లేకపోవడం, ఇతర కారణాల వల్ల పలాశ్ ఒత్తిడికి లోనై అస్వస్థతకు గురైనట్లు అతడి టీమ్ పేర్కొంది.



## ఆ డైట్ అస్సలు పాటించకండి అంటున్న మాళవిక

హీరోయిన్ మాళవిక మోహనన్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇన్నాళ్లు తమిళం, మలయాళం భాషలలో వరుస సినిమాల్లో నటించి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. ఇక ఇప్పుడు రాజా సాబ్ సినిమాతో తెలుగు తెరకు పరిచయం కాబోతుంది. ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబోలో రాబోతున్న ఈ సినిమా పై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది.అయితే ఓ సినిమా కోసం మాళవిక కేవలం రెండు వారాల్లోనే 8 కిలోల బరువు పెరిగిందట. అంతకు ముందు 14 రోజుల్లోనే బరువు తగ్గింది. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మాళవిక.. తన ఫిట్నెస్ సిక్రెట్ రివీల్ చేసింది.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## ఆరేండ్ల బాలుడిపై పెంపుడు కుక్క దాడి

తెగిపడిన చెవి.. యజమాని అరెస్ట్

దేశ రాజధాని ఢిల్లీలో ఓ బాలుడిపై పెంపుడు కుక్క దాడి చేసింది. ఆ పిల్లాడిని దానిని తప్పించేందుకు స్థానికులు ప్రయత్నించినప్పటికీ.. అతని చెవి తెగిపోయేదాక అది వదల్లేదు. ఆదివారం సాయంత్రం 5.38 గంటల సమయంలో ప్రేమ్‌నగర్ ప్రాంతంలోని విజయ్ ఎన్‌క్లేవ్‌లోని తన ఇంటి సమీపంలో ఆడుకుంటున్నాడు. ఇంతలో రాజేశ్ పాల్(50) అనే టైలర్‌కు చెందిన పిట్‌బుల్ జాతి కుక్క అకస్మాత్తుగా ఇంటి నుంచి బయటకు వచ్చింది. అక్కడే అక్కడున్న బాలుడిపై దాడి చేయబోయింది. పిల్లవాడు దాని బారి నుంచి తప్పించుకుని పరుగుతీస్తుండగా వెంటాడిన కుక్క అతనిపై ఎగబడింది. ఓ మహిళ దానిని ఆపడానికి ప్రయత్నించినప్పటికీ అది ఆగలేదు. అక్కడే ఉన్న మరో వ్యక్తి దానిని గమనించిన ఆ బాలుణ్ని రక్షించబోయారు. అయినప్పటికీ బాలుడిని వదలని శునకం.. అతని కుడి చెవి తెగిపోయేలా కరిచింది.

## గంభీర్‌ను తొలగించండి..
## హెడ్‌కోచ్‌పై ఫ్యాన్స్ ఆగ్రహం




స్వదేశంలో భారత జట్టు దారుణంగా తడబడుతుండటంతో అభిమానుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఏడాది క్రితం న్యూజిలాండ్ చేతిలో ఘోర ఓటమిని ఎదుర్కొన్న భారత్.. తాజాగా దక్షిణాఫ్రికాతోనూ అదే బాటలో వెళ్తుండటంతో హెడ్‌కోచ్‌గా గంభీర్ దారుణంగా విఫలమయ్యాడని వారు ఆరోపిస్తున్నారు. రెండో టెస్టులో భారత బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కూలిపోయిన అనంతరం సోషల్‌మీడియాలో '#Sack Gautam Gambhir' హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్ అయింది. మునుపెన్నడూలేని విధంగా ఏడాదికాలంగా సొంతగడ్డపై స్పిన్ ఆడటంలో తంటాలు పడుతున్న భారత జట్టును ఇకనైనా కాపాడాలంటే కోచ్‌గా గంభీర్‌ను తప్పించాలని బీసీసీఐని కోరుతూ పలువురు అభిమానులు పోస్టులు పెడుతున్నారు.

## 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు
# రేషన్ కార్డు ఉంటే మీ ఇంటికే చీర



తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ.. ముఖ్యంగా ఆడబిడ్డల ఆర్థిక స్వావలంబనపై దృష్టిసారించింది. ఇందులో భాగంగానే ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించింది. రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు కలిగి.. 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు ఈ చీరలను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. సిద్దిపేట జిల్లాలోని కోహెడలో జరిగిన ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలనే మహోన్నత లక్ష్యంతో పనిచేస్తోందని స్పష్టం చేశారు. తెల్ల రేషన్ కార్డు కలిగి.. 18 ఏళ్లు నిండిన మహిళలకు ఇందిరా మహిళా శక్తి పేరుతో చీరలను పంపిణీ చేస్తామని.. మహిళా సంఘంలోని మహిలలే ఇంటికి వచ్చి బొట్టు పెట్టి అందజేస్తారన్నారు. ఆడబిడ్డలకు ఏ కష్టం రానివ్వమని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అనేక సంక్షేమ కార్యక్రమాలను వేగంగా ప్రారంభించిందని తెలిపారు. మహిళా సంఘాలకు మరింత ప్రోత్సాహం అందించేందుకు.. వారికి పది సంవత్సరాల పాటు వడ్డీలేని రుణాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా.. మహిళా సంఘాలు ఆర్థిక వృద్ధిని సాధించేందుకు వీలుగా పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సహకారం అందిస్తున్నామని వివరించారు. ఈ చీరల పంపిణీ అనేది పథకం మాత్రమే కాదని.. మహిళల పట్ల ప్రభుత్వానికి ఉన్న గౌరవాన్ని, వారికి అందించే 'సారె' (బహుమతి)ని సూచిస్తుందని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి.. ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా.. ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉన్న మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు అందిస్తామని ప్రకటించినప్పటికీ... క్షేత్ర స్థాయిలో కొన్ని గ్రామాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని చోట్ల అధికారులు మహిళా సంఘంలో సభ్యత్వం ఉన్న వారికే ప్రాధాన్యత ఇస్తుండటం, రేషన్ కార్డు ఉన్నప్పటికీ సంఘంలో లేని అర్హులైన మహిళలకు చీరలు అందకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం.. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ చీరలు పంపిణీ చేయాలని స్పష్టం చేస్తున్నప్పటికీ.. పంపిణీ ప్రక్రియలో లోపాల వల్ల కొంతమంది అర్హులకు అన్యాయం జరుగుతోందని ఆయా గ్రామాల మహిళలు తమ నిరాశను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి.. క్షేత్ర స్థాయిలో పంపిణీ ప్రక్రియను మరింత పారదర్శకంగా.. సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని మహిళా లోకం కోరుతోంది.

### అయోధ్యలో ధ్వజారోహణం..
## రామ మందిరంపై కాషాయ జెండా ఎగురవేసిన ప్రధాని మోదీ



అయోధ్యానగరిలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ తర్వాత మళ్లీ అలాంటి పవిత్రమైన, చరిత్రాత్మక ఘట్టం మొదలైంది. మంగళవారం అయోధ్య రామమందిరంలో జరిగిన ధ్వజారోహణ కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ, RSS చీఫ్ మోహన్ భగవత్ పాల్గొన్నారు. అయోధ్య రామాలయ కంప్లెక్స్‌లో పలు దేవాలయాలను దర్శించారు. ఆ తర్వాత RSS సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్‌తో కలిసి, తొలి అంతస్తులోని రామదర్బార్‌లో పూజలు చేశారు ప్రధాని మోదీ. ఆ తర్వాత ఆయనతో కలిసి గర్భగుడికి వెళ్లి రామ్‌లల్లా విగ్రహం దగ్గర పూజలు చేశారు. అనంతరం అయోధ్యానగరిలో చరిత్రాత్మక ఘట్టమైన రామమందిరంపై జెండాను ప్రధాని మోదీ ఎగరవేశారు. ఆలయపనుల ముగింపునకు గుర్తుగా ఈ ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. ఉదయం 11గంటల 58 నిమిషాలకు ప్రధాని మోదీ రామ మందిరంపై కాషాయ జెండా ఎగురవేశారు. ఆలయ నిర్మాణం పూర్తితో, సాంస్కృతిక వేడుకలు జాతీయ ఐక్యత క కొత్త అధ్యాయానికి నాంది పలికేలా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంతో అయోధ్య రామ మందిర నిర్మాణ పనుల్లో చివరి ఘట్టం పూర్తైంది. అయోధ్యలో రామ్‌లల్లాకు ప్రాణప్రతిష్ట చేసిన 673 రోజుల తర్వాత ఆలయ శిఖరంపై ధ్వజారోహణం చేశారు.




## ఎల్లుండే పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్..
### సాయంత్రం 6 గంటలకు షెడ్యూల్ విడుదల చేయనున్న ఈసీ

తెలంగాణ పంచాయతీ ఎన్నికలకు ముహూర్తం ఖరారైంది. ఎల్లుండి (గురువారం) సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేయనుంది. ఈ మేరకు ఇవాళ సాయంత్రం ఆరు గంటలకు ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేయనున్నట్లు సమాచారం. తాజా సమాచారం ప్రకారం.. డిసెంబర్ 11వ తేదీన తొలి విడతలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రారంభించి, ఫలితాలను విడుదల చేయనున్నట్లు సమాచారం. నాలుగు రోజుల తేడాతో రెండు, మూడో విడత ఎన్నికలు నిర్వహించి, ఫలితాలను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.



## హాట్ నెస్‌కు కేరాఫ్ అడ్రస్

తెలుగులో ఎంతో మంది ముద్దుగుమ్మలు తమ అందచందాలతో, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కానీ ఆతర్వాత టాలీవుడ్ కు దూరం అయ్యారు. తెలుగులో కొన్ని సినిమాలే చేసి ఆ తర్వాత బాలీవుడ్ కు చెక్కేసినవారు చాలా మంది ఉన్నారు. కొంతమంది ముద్దుగుమ్మలు ఒకటి రెండు సినిమాలతోనే పరిమితం అవుతున్నారు. పెళ్లి చేసుకొనో.. లేక అవకాశాలు లేక సినిమాలకు దూరం అయ్యారు. ఒక ముద్దుగుమ్మ తెలుగులో రెండే సినిమాలు చేసింది. అందులో ఒకటి డిజాస్టర్ కాగా ఓ సినిమా సంచలన విజయం సాధించింది. కానీ ఈ బ్యూటీకి ఆఫర్స్ మాత్రం లేదు. ఇప్పుడు ఒకొక్క సినిమాకు రూ. 3 కోట్లు వసూల్ చేస్తుంది ఈ చిన్నది. అలాగే ఆమె ఆస్తి పాస్తులు కూడా కోట్లల్లో ఉన్నాయి. అంతే కాదు ఇండస్ట్రీలో ఆమెను మించిన హాట్ బ్యూటీ లేదు. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా..? ఇండస్ట్రీలో హాట్ బ్యూటీగా పేరు తెచ్చుకుంది ఆమె.. అందంలో అప్సరస.. కానీ తెలుగులో చేసిన సినిమాలు మాత్రం రెండు సినిమాలే ఒకటి డిజాస్టర్, మరో సినిమా భారీ హిట్. ఆమె ఎవరో కాదు దిశా పటాని. ఈ హాట్ బ్యూటీ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు.

## తల్లిదండ్రులు మందలింపు..
## విద్యార్థి ఆత్మహత్య

పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని తల్లిదండ్రులు మందలించడంతో 10వ తరగతి విద్యార్థిని శ్రీ వైష్ణవి తీవ్ర మనస్థాపానికి గురై.. ఆపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మంగళవారం హైదరాబాద్‌లోని హబ్సిగూడలో జరిగింది. విద్యార్థిని ఆత్మహత్యపై పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని శ్రీవైష్ణవి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలపై ఆమె తల్లిదండ్రుల నుంచి పోలీసులు ఆరా తీస్తున్నారు. హబ్సిగూడలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో శ్రీవైష్ణవి చదువుతోందని పోలీసులు తెలిపారు.

## క్రిప్టో పెట్టుబడులతో నష్టాలు.. ట్రంప్ కుటుంబ ఆస్తుల విలువ ఢమాల్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబానికి క్రిప్టో పెట్టుబడుల కారణంగా భారీ షాక్ తగిలింది. పెద్ద ఎత్తున నష్టాలు ఎదురవడంతో ఆయన కుటుంబ ఆస్తుల విలువ ఏకంగా ఒక బిలియన్ డాలర్ల మేర పడిపోయింది. బ్లూమ్‌బర్గ్ సంస్థ కథనం ప్రకారం, నష్టాల రిస్క్ ఎక్కువగా ఉండే డిజిటల్ ఆస్తులపై ట్రంప్ కుటుంబం పెట్టిన భారీ పెట్టుబడులు ఈ మధ్య నష్టాలను తీసుకొచ్చాయి. సెప్టెంబర్‌లో ట్రంప్ కుటుంబ ఆస్తుల విలువ 7.7 బిలియన్ డాలర్లు. కానీ నేడు వాటి విలువ 6.7 బిలియన్ డాలర్‌లకు పడిపోయింది. ఈ నష్టాల్లో అధిక శాతం మీమ్ కాయిన్స్, ఇతర స్పెక్యులేటివ్ క్రిప్టో పెట్టుబడుల కారణంగా వచ్చాయి. ఇటీవల కాలంలో ట్రంప్ బ్రాండెడ్ మీమ్ కాయిన్ విలువ ఏకంగా 25 శాతం మేర పతనమైంది. ఓ బిట్ కాయిన్ మైనింగ్ సంస్థలో ట్రంప్ తనయుడు ఎరిక్‌కు ఉన్న వాటా విలువ కూడా ఒకప్పటి గరిష్ఠ స్థాయితో పోలిస్తే సగం మేర పతనమైంది. సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ మాతృ సంస్థ ట్రంప్ మీడియా అండ టెక్నాలజీ గ్రూప్ (టీఎమ్‌టీజీ) షేర్లు కూడా భారీ స్థాయిలో పతనమయ్యాయి. ఇక ఈ సంస్థలో ట్రంప్‌నకు ఉన్న వాటా విలువ గత రెండు నెలల్లో 800 మిలియన్ డాలర్ల మేర తగ్గింది. టీఎమ్‌టీజీలో ట్రంప్ అతిపెద్ద షేర్ హోల్డర్‌గా ఉన్న విషయం తెలిసిందే. ట్రంప్‌పై విశ్వాసంతో క్రిప్టో పెట్టుబడులు పెట్టిన వారు కూడా దెబ్బతిన్నారు. ట్రంప్ బ్రాండెడ్ మీమ్ కాయిన్ విలువ జనవరితో పోలిస్తే భారీ స్థాయిలో పతనమైంది. అయితే, ఇది నిరుత్సాహం చెందాల్సిన సమయం కాదని డొనాల్డ్ ట్రంప్ తనయుడు ఎరిక్ ట్రంప్ భరోసా ఇచ్చారు. క్రిప్టో కొనుగోళ్లకు ఇదే కరెక్ట్ సమయం అని అన్నారు. కంగారు పడి పక్కదారి పట్టొద్దని సూచించారు. క్రిప్టో కరెన్సీ భవిష్యత్తుకు ఎలాంటి ఢోకా లేదని స్పష్టం చేశారు. స్థూలంగా చూస్తే మాత్రం క్రిప్టో పెట్టుబడులు ట్రంప్ కుటుంబానికి కనక వర్షం కురిపించాయని నిపుణులు చెబుతున్నారు. ట్రంప్ అధ్యక్షుడయ్యాక ఆయన కుటుంబం క్రిప్టో పెట్టుబడుల వైపు మళ్లింది. ఇటీవలి నష్టాలను అటుంచితే.. వారి ఆస్తుల విలువ గతంతో పోలిస్తే బిలియన్‌ల డాలర్ల మేర పెరిగింది.



## జూబ్లీహిల్స్‌లో అర్ధరాత్రి దోపిడీకి యత్నం

జూబ్లీహిల్స్‌లో అర్ధరాత్రి దోపిడీ యత్నం జరిగింది. అయితే పోలీసులు వెంటనే స్పందించి అడ్డుకున్నారు. అజయ్ అగర్వాల్ ఇంట్లో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఆ ఇంటిలో చాలా ఏళ్లుగా పనిచేస్తున్న వాచ్‌మన్ రాధా చంద్ ఐదుగురితో కలిసి దోపిడీకి ప్లాన్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి గ్యాంగ్ కత్తులు, తాళ్లతో అక్కడికి చేరుకుంది. ముందుగా డ్రైవర్‌పై దాడి చేశారు. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులను బెదిరించే ప్రయత్నం చేశారు.